ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 సంచిక : 04 డిసెంబర్ 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

కైకలూరు ............ 18-08-08

బిభీమవరం .......... 01-09-08

తణుకు ............... 09-11-08

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-08-08, కైకలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు రాఘవేంద్రస్వామి బృందావన ప్రవేశం చేసిన రోజు. జీవసమాధి అంటే శరీరంలో ప్రాణంఉండగా సమాధిలోనికి వెళ్ళిపోతారు, దానిని బృందావనం అంటారు. రాఘవేంద్రస్వామి స్వగ్రామం తమిళనాడు లోని కుంభకోణం. అది శివక్షేత్రం, విష్ణుక్షేత్రం కూడా. రాఘవేంద్రస్వామి కొంతకాలం గృహస్థాశ్రమంలో ఉన్నారు, తరువాత సన్యాసం తీసుకొన్నారు. రాఘవేంద్రస్వామిని మంత్రాలయ గురువు అంటారు. పూర్వపు యుగాల లో ప్రహ్లాదుడు యజ్ఞం చేసిన చోటు మంత్రాలయం. మంత్రాలయం ముస్లింల పాలనలో ఉండేది. ఆ నవాబుగారికి ఏవో రోగాలు ఉంటే రాఘవేంద్రస్వామి తగ్గించారు. నా రోగాలు తగ్గించి నన్ను ఆరోగ్యవంతు డిని చేసారు ఏదైనా కోరుకోండి అని నవాబు చెప్పాడు. నాకు బాహ్యంగా ఏమీ కోరికలు లేవు, మంత్రాలయం అనే ఊరు ఇమ్మని అడిగారు. అది చిన్న ఊరు. అక్కడే ఆయన జీవసమాధి పొందారు. ఆయన బతికి ఉండగా ఆ సమాధి అంతా ఆయనే తయారుచేసుకొన్నారు. షిరిడీ బాబాగారి ద్వారా మహిమలు ఎలా జరిగాయో అలాగే ఈయన ద్వారా కూడా మహిమలు జరిగాయి. ఆయన సమాధిలోనికి వెళ్ళేముందు ఏమని చెప్పారు అంటే 700 సంవత్సరాలు నేను ఇక్కడ సమాధిస్థితిలో ఉంటాను, ఎవరు ఏది కోరుకొన్నా నేను నెరవేరుస్తాను అని చెప్పారు. రాఘవేంద్రస్వామిని నమ్మినవారు ఏమంటారు అంటే ఆయన కల్ప తరువు, కామధేనువు అని చెపుతారు. కల్పతరువు అంటే వృక్షం. చెట్టు మనకు

ఎలాగ నీడను ఇస్తుందో అలాగ సంసారంలో వచ్చే కష్టాలతో, నష్టాలతో, బాధలతో ఇబ్బందిపడేవారికి ఆయన నీడను ఇస్తాడు కాబట్టి కల్పతరువు అన్నారు. కామధేనువు మనకు ఏది కావాలంటే అది ఇస్తుంది. మనకు కోరికలు ఉంటే ఆ కోరికలు నెరవేర్చేదేవుడు కాబట్టి రాఘవేంద్రస్వామిని కామధేనువు అంటారు. మనం శివుడిని లింగరూపంలో ఆరాధిస్తాము. వైష్ణవులు విష్ణువుని సాలిగ్రామ శిలలో ఆరాధిస్తారు. లక్ష్మీనారాయణ శిలలు 800కు పైన స్థాపించి కింద బృందావనంలో రాఘవేంద్రస్వామి ప్రవేశించారు అని చెపుతారు. అప్పటి నుండి కోరికలు నెరవేర్చే బృందావనం అని ప్రసిద్ధి పొందటం, అక్కడకు యాత్రలకు వెళ్ళటం జరుగుతోంది.

మన అందరిలోను చెడ్డ ఏమిటి అంటే మనకు ఏదైనా అశాంతి వచ్చినప్పడు, దుఃఖం వచ్చినప్పడు దేవుడిని ప్రార్థిస్తాము, మిగతా టైములో దేవుడిని మర్చిపోతాము. మన శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పడు, మనస్సు ఆరోగ్యంగా ఉన్నప్పడు, సంసార పరిస్థితులు బాగా ఉన్నప్పడు మనకు దేవుడు అక్కరలేదు. మన కోరికలను నెరవేర్చమని దేవుడిని ప్రార్థిస్తాము, ఏదైనా రోగం వస్తే ఆరోగం తగ్గించమని దేవుడిని ప్రార్థిస్తాము ఇలా ఏదో కారణం ఉండి దేవుడిని ప్రార్థిస్తాము కాని దేవుడి మీద మనకు నిజంగా భక్తి లేదు, ప్రేమ లేదు, విశ్వాసం లేదు. ఇదంతా ఆయనకు తెలుసు. ఇటువంటి మనకు ఆయన మోక్షం ఇవ్వడు. మరి మోక్షం ఎవరికి వస్తుంది అంటే ఎవరైతే కష్టపడి సాధన చేసి నూటికి నూరుపాళ్ళు ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం సంపాదిస్తారో వారికి మాత్రమే ఆయన దయ కలుగుతుంది, భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. హృదయంలో ఉన్న వాసనలు మెదడులోనికి వచ్చినప్పడు ఆ వాసనలు ఉన్నాయి అని మనకు తెలుస్తుంది. మనలో ఉన్న వాసనలను గ్రహించి ఆ వాసనలను ఎవడైతే ధైర్యంగా, శాంతిగా, ఓర్పుగా తొలగించుకోగలుగుతున్నాడో వాడే వీరుడు, వాడే ధీరుడు అంతేగాని పదిమంది మనుషులను చంపినవాడు వీరుడుకాదు, ధీరుడుకాదు. వేదాంతం రెండు మాటలలో చెప్పమని ఒకసారి చిన్మయానందను అడిగితే ఆయన ఏమి చెప్పారు అంటే మూసుకోవలసింది మూసుకో, తప్పకోవలసింది తప్పకో అని చెప్పారు. ఇంద్రియాలకు విషయాలతోటి సంబంధాలు ఉంటాయి. అందుచేత నీ ఇంద్రియాలకు విషయాలతో ఉన్న సంబంధాన్ని మూసేసుకో, అది గోడకట్టినట్లు ఆపుచేసేయి. దేహము నేను, దేహము నేను అని అందరూ దేహానికి పరిమితమై ఉంటారు. ఆ దేహము నేను అనే తలంపులో నుండి తప్పకో. ఇదే వేదాంతసారము. నీకు ఇంద్రియనిగ్రహం లేదు అనుకో, మనోనిగ్రహం లేదు అనుకో నీకు ఎంత డబ్బు ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా, సమాజంలో నీకు ఎంత పేరు ప్రతిష్టలు ఉన్నా ఇవన్నీ

మూడు రోజులు ముచ్చటేగాని, ఇవన్నీ ఒకటి లేని సున్నలు.

మన ఇంట్లో ఇంకో నాలుగురోజులలో పెళ్ళి ఉంది అనుకోండి. మన మనస్సు, మాట, చేత అన్నీ పెళ్ళిపనుల మీదే ఉంటాయి. చేతులు దానికి సంబంధించిన పనులే చేస్తాయి, మనస్సు దాని గురించే ఆలోచిస్తుంది, ఇంట్లో అందరూ పెళ్ళి గురించే మాట్లాడుకొంటారు. అందరూ ఏకాగ్రతతో పెళ్ళిపనులే చేస్తారు మిగతాగొడవలు ఏవైనా చెప్పినా తరువాత చూద్దాము, తప్పకోండి, తప్పకోండి అంటాము. ఆలోచన, మాట, చేత మూడూ కలిసిపోయి ఎంత తీవ్రంగా, ఎంత ఏకాగ్రతతో పెళ్ళిపనులు చేస్తారో అంత తీవ్రంగా ఆత్మజ్ఞానసముపార్జనకోసం సాధన చేస్తేగాని నీకు భగవదనుభవం కలుగదు అని శాస్త్రంలో చెప్పారు. మనం చిన్న చిన్న పనులు చేసినప్పటికీ అవి గుర్తింపులకోసం చేయకూడదు, హితవుగా ప్రేమగా చెయ్యాలి. మనం పూజ చేస్తాము, జపం చేస్తాము కాని మనకు భగవంతుడి మీద ఉండవలసినంత ప్రేమలేదు, భక్తి లేదు. ఏదో లాంఛనం కోసం చేస్తూ ఉంటాము. మనలో అంతర్యామిగా ఉన్న భగవంతుడు ఇది అంతా చూస్తూ ఉంటాడు. గురువు హృదయం ఆకాశం అంత విశాలంగా ఉండాలి. శిష్యుడు విశ్వాసపాత్రుడు అయి ఉండాలి, గురువుపట్ల గురి, నమ్మకం ఉండాలి. శరీరానికి చావు వచ్చేస్తుందికాని చావులేని సత్‌పదార్థం నీలోపల ఉంది. ఈ శరీరానికి మృత్యువు రాకముందే నీ లోపల ఉన్న సత్యపదార్థాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఈ శరీరం ఉండగా మృత్యువులో నుండి విడుదలపొంది అమృతత్వం ఎవడైతే పొందాడో వాడు ఒక్కడు మాత్రమే ఈ సృష్టిలో ధన్యుడు. అది ఎలా సాధ్యమవుతుంది అంటే నువ్వు నా పని చేసిపెట్టు, నన్ను స్మరించుకో, నన్ను నమ్ముకో, నాకు ఇష్టమైన పనులు చెయ్యి, నాకు నమస్కరించు, నన్ను ప్రార్థించు ఇలాగ నీ జీవితం పొడుగునా నీ మనస్సు నా చుట్టూ తిరిగితే మృత్యువులోనుండి అమృతత్వం పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ శరీరాలు నిజం అనుకోవద్దు, ఇవి చొక్కాలు. చొక్కా చిరిగినప్పుడు అది తీసి ఎలా అవతల పడేస్తున్నావో అలాగే ఈ శరీరం చిరిగిపోయినప్పుడు తీసి అవతల పడేస్తారు.

జీవాత్మ, పరమాత్మ అని చెపుతూ ఉంటారు. జీవుడికి కొన్ని లక్షణాలు ఉంటాయి. జీవుడు తన లక్షణాలను, ప్రకృతి గుణాలను పోగొట్టుకొంటే ఇప్పుడే, ఇక్కడే వాడు పరమాత్మను పొందుతాడు. రావణాసురుడి కొడుకు పేరు ఇంద్రజిత్తు. ఇంద్రుడిని జయించాడు కాబట్టి

వాడికి ఇంద్రజిత్తు అని పేరు వచ్చింది. ఇంద్రజిత్తు గొప్పవాడు కాదు, ఇంద్రియజిత్తు గొప్పవాడు అని శాస్త్రం చెపుతుంది. అంటే ఇంద్రియాలను జయించినవాడు గొప్పవాడు, వాడు మోక్షాన్ని పొందటానికి అర్హుడు. ఒకరోజున మహేంద్రనాథ్‌గుప్తా వచ్చి గదిలో కూర్చున్నాడు. రామకృష్ణుడు దోమతెరలో కూర్చొన్నాడు. అప్పుడు రామకృష్ణుడు ఏమన్నాడు అంటే మహేంద్రనాథ్‌గుప్తా నువ్వు దోమ తెరలోపలికి వచ్చి మంచం మీద నా దగ్గర కూర్చో అంటాడు. వారిద్దరికి అంత సన్నిహితం, అక్కడ వేరుభావన లేదు. గురువుగారితో సమానంగా కూర్చోవటానికి గుప్తా భయపడుతున్నారు కాని రెండుసార్లు పిలిచేటప్పటికి వెళ్ళి కూర్చొన్నాడు. నువ్వు నా మహేంద్రనాథ్‌వి, నేను నీ రామకృష్ణుడిని, బేధభావం అక్కరలేదు నాతో సమానంగా కూర్చో అని చెపుతాడు, హృదయం హృదయం కలిసినవేళ అక్కడ మాధుర్యం తప్పించి దేహభావన ఏమీ ఉండదు. చంటిపిల్లలకు దేహభావన ఉండదు. బట్టలు లేకుండా చంటిపిల్లలకు స్నానం చేయిస్తూ ఉంటారు. వారు చూస్తున్నారు, వీరు చూస్తున్నారు అనే భావన వారికి ఉండదు, అక్కడ భేదభావన లేదు, వారు స్వర్గరాజ్యానికి అర్హులు. తరువాత వయస్సు వస్తూ ఉంటుంది, చుట్టూ సమాజం ఉంటుంది, ఆ సమాజాన్ని చూసి మాయ నేర్చుకొంటారు. అందుచేత సమాజంలో అతిగా ఉండకూడదు. అసలు సంబంధం లేకుండా ఉండలేము అందువలన సమాజంతో ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండాలి. మన బంధువులతోగాని, స్నేహితులతోగాని, సమాజంతోగాని అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే మాయలోనుండి బయటకు రాలేము, ప్రకృతిలో మునిగిపోతాము. మనస్సును విడిచిపెట్టి మాయకోసం వెదకకండి, మాయ అంతా మనస్సులో ఉంది అని ఆచార్యులవారు చెప్పారు. మనస్సుకు వేరుగా మాయలేదు. మనస్సును జయిస్తే మాయను జయించినట్లే. మీరేమో మనస్సు వేరు అనుకొంటున్నారు, మాయ వేరు అనుకొంటున్నారు. మనస్సుకు వేరుగా ఎక్కడో మాయ ఉంది అనుకొంటున్నారు. మరల మాయలో పడటానికి అదొక మాయ. మన పనులు మనం చేసుకోవాలి. ఇంటి దగ్గర మనం చేసుకొనే పనులు విడిచిపెట్టేసి సోమరితనానికి అలవాటుపడితే మీకు జ్ఞానం వస్తుందని అనుకొంటున్నారేమో, పని మానివేయటం వలన నీకు జ్ఞానం రాదు, సోమరితనం వస్తుంది. పని మానివేస్తే నీ దేహయాత్ర నడవదు. అందుచేత మనకాళ్ళమీద మనం నిలబడాలి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. మన పని ఏదో మనం చేసుకోవాలి, చేతనైతే ఇతరులకు ఉపకారం చేయాలి. నీకు జీవకోటి పట్ల నిజంగా ప్రేమ ఉంటే ఎవరినీ హర్ట్ చేయకు, అంటే ఎవరి మనస్సును

గాయపరచవద్దు. మీరు సబ్జక్టు చెప్పవచ్చు, ఎలా చెప్పాలి అంటే వాడి మనస్సును గాయపరచకూడదు అలాగని సబ్జక్టు చెప్పటం మానకూడదు. అంటే ఆపరేషన్ జరిగిపోవాలి, నొప్పి తెలియకూడదు.

రంగులరాట్నం తిప్పేవాడు ఆ బొమ్మలను ఎలా తిప్పతాడో ఈ శరీరం అనే బొమ్మలను వారి ప్రారబ్దంననుసరించి నేను తిప్పతున్నాను అని పరమాత్మ చెపుతున్నాడు. నేను అది చేసాను, ఇది చేసాను అని చాలా మంది అనుకొంటారు. ఆ దేహమే తాను అనుకోవటం వలన అలా అనుకొంటున్నారు, అది తెలివితక్కువతనం. అది సాధించటానికి, ఇది సాధించటానికి అసలు నువ్వు ఉన్నావా? దేవుడు సాధించిపెట్టింది నేను సాధించాను అనుకొంటున్నారు. ఇంత చిన్న విషయం కూడా నీ బుర్రకు తెలియటంలేదు. భగవంతుడి సంకల్పం మన సంకల్పం అనుకోవాలి, భగవంతుడి ఇష్టమే మన ఇష్టం అనుకోవాలి. భగవంతుడికి భిన్నంగా మనం చేసేది ఏమీ లేదు. భగవంతుడి సంకల్పం బలీయమైనది. రోడ్డురోలరు నడుస్తూ ఉంటే మేకలు, గొర్రెలు అడ్డువస్తే వాటి పరిస్థితి ఏమవుతుందో, భగవంతుడి సంకల్పానికి వ్యతిరేకంగా మనం ముందుకు వెళ్ళినా మన పరిస్థితి అలాగే అవుతుంది. ఎవడైతే భగవంతుడి సంకల్పంతో తన సంకల్పాన్ని ఐక్యం చేస్తున్నాడో, భగవంతుడి ఇష్టంలో తన ఇష్టాన్ని ఐక్యం చేస్తున్నాడో అది ఈశ్వర ప్రణిదానం. దేహప్రారబ్దాన్నిబట్టి ఒకోదేహం ఒకోపని చేస్తున్నప్పటికీ మనస్సులో మటుకు ఈశ్వరుడిని అంటిపెట్టుకొని ఉండాలి. మన డ్యూటీ మనం చేయాలి అంతేగాని దేనిగురించి బెంగపెట్టుకోవద్దు. ఎటువంటి పరిస్థితులలోను మనం వర్రీ పడకూడదు. అలా వర్రీపడేబదులు పరిస్థితులను చక్కబెట్టమని భగవంతుడిని ప్రార్థించటం మంచిది. మన డ్యూటీ మనం శ్రద్ధగా చేయాలి, డ్యూటీ విషయంలో అశ్రద్ధ పనికిరాదు. డ్యూటీ చేయకపోతే భగవంతుడు మనలను క్షమించడు. నీ చేతిలో ఉన్న పనిని హృదయపూర్వకంగా చెయ్యి, మనస్సును అక్కడ పెట్టి చెయ్యి. భగవంతుడు ఎంత శక్తివంతుడో, ఎంత సర్వజ్ఞుడో మీకు తెలిసినప్పడే ఆయన వైభవం గురించి మీకు తెలిసినప్పడే ఆయన మాట మీద మీకు గౌరవం కలుగుతుంది కాని ఆయన వైభవం మీకు తెలియనప్పడు ఆయన మాట మీద కూడా మీకు గౌరవం ఉండదు. ప్రార్థించే నోటికంటే పనిచేసే చేతులు అంటే భగవంతుడికి ఎక్కువ ఇష్టం. మీకు ఎవరిపట్ల అయినా క్రూరత్వం వస్తూ ఉంటే, అసూయ వస్తూ ఉంటే, ఎవరికైనా అపకారం చేయాలనే బుద్ధి మీకు కలుగుతూ ఉంటే వారి పరిస్థితులు మీకు తెలియకపోవటం వలన, క్షమించే బుద్ధి

మీకు లేకపోవటం వలన ఇటువంటి విపరీత భావాలు మీకు వస్తున్నాయి. వారిని అవగాహన చేసుకోవటంలో కూడా లోపం ఉండవచ్చు, ఇతరుల పట్ల ప్రేమ తగ్గిపోతూ ఉంటే వారిపట్ల మనకు అసూయ వచ్చే ప్రమాదం ఉంది. మనకు భగవంతుడు కావాలంటే మనం ఎప్పుడూ సమాజాన్ని అనుకరించకూడదు. మనం ఏ పని చేసినా ఈశ్వరుడి ప్రీత్యర్థం చేయాలి. మనకు మోక్షం ఇచ్చేది సమాజం కాదు, మోక్షం ఇచ్చేది భగవంతుడు. మనం ఏమాట ఎందుకు మాట్లాడుతున్నామో, ఏ పని ఎందుకు చేస్తున్నామో, ఏ తలంపు ఎందుకు వస్తోందో అన్నీ ఈశ్వరుడు చూస్తూనే ఉంటాడు.

శబరి దగ్గరకు రాముడు వస్తాడు. శబరి ముందుగా పళ్ళను రుచి చూసి పండు బాగుంటేనే రాముడికి ఇచ్చేది, చేదుగా ఉంటే బయట పడేస్తుంది. శబరి ఎంగిలి చేసి ఇచ్చినా అవి ఎంగిలి చేసిన పండ్లు అని రాముడు అనుకోడు, అక్కడ శబరి యొక్క హృదయాన్ని రాముడు చూస్తున్నాడు. ఫలహారం అయిపోయింది. అప్పుడు రాముడు శుద్ధ భక్తి గురించి శబరికి భోదించాడు. రాముడు చెపుతున్నాడు, శబరి వింటోంది, అలా వింటూనే దేహాన్ని, మనస్సును విడిచిపెట్టి రాముడిలో ఐక్యమైపోయింది. అది శబరి యొక్క ఔన్నత్యం, ఆ ఏకాగ్రత అటువంటిది, ఆ పవిత్రత అటువంటిది. మనం 90 రకాలుగా ఆలోచిస్తాము. శబరికి భగవంతుడిని పొందటం తప్పించి ఇంకో ఆలోచన లేదు. మనకు ఐదుపైసలు భక్తి ఉంటుంది, మిగతా 95 పైసలు మన మనస్సు లోకంమీద ఉంటుంది. శబరి అట్టిది కాదు. మనస్సును నూటికి నూరుపాళ్ళు రాముడికి అర్పించింది. ఆ మనస్సులో రాముడికి తప్పించి ఇంకొకరికి స్థానం లేదు. శబరి, బుద్ధుడు వాళ్ళకేదో దుఃఖం ఉందని ఇల్లు విడిచిపెట్టి రాలేదు. ఇతరుల యొక్క దుఃఖాన్ని, ఇతరుల యొక్క అశాంతిని ఆర్పటానికి, సమాజాన్ని ఉ ద్ధరించటానికే వారు బయటకు వచ్చారు. నీకు ఉన్న కామం అంతా ప్రేమగా మారిపోవాలి, అదే సాధన. కామం ఏదో ఒకటి అడుగుతుంది, ప్రేమ ఏమీ అడగదు. పని పనికోసమే ప్రేమించాలి, మనిషిని మనిషికోసమే ప్రేమించాలి, ఏదో వాంఛించి ప్రేమించటం కాదు. ఇప్పుడు నీ మనస్సుతోటి, నీ దేహంతోటి నీకు ఎంత తాదాత్మ్యం ఉందో లోపల ఉన్న వస్తువుతో నీకు అంత తాదాత్మ్యం వస్తే అప్పుడు నీకు మోక్షం వస్తుంది కాని పని విడిచిపెట్టేసి తిరిగినంతమాత్రం చేత నీకు మోక్షం రాదు.

తుకారామ్ సంసారంలో చాలా కష్టాలు పడ్డాడు అనుకొంటాము. తుకారామ్

ఏమన్నాడు అంటే మనిషి ఎన్ని కష్టాలు పడాలో అన్ని కష్టాలు నా దగ్గరకు పంపావు, ఇంక అదనంగా పంపటానికి ఏమీ లేవు, ఎన్ని కష్టాలు పడినా నీమీద ప్రేమ పోలేదు, నాకు వికారం రాలేదు, నా చేతిలో నువ్వే ఓడిపోయావు విఠల్ అని తుకారామ్ అంటాడు. మన భక్తి అలా ఉండాలి. ఏదో జీవుడు మోక్షం పొందటం కాదు, మహావిష్ణువు విమానం పంపితే సశరీరంగా వెళ్ళిపోయాడు, అదీ తుకారామ్ వైభవం. భగవంతుడు అలా ఎందుకు చేసాడు, ఇలా ఎందుకు చేసాడు అని రోజూ భగవంతుడితో పేచీలు పెట్టుకోవద్దు. భగవంతుడి సంకల్పానికి ఇష్టపడు, ఆయన సంకల్పంతో రాజీపడు. ఏది మంచో, ఏది చెడ్డో నీకు తెలియదు, నిన్ను సృష్టించిన భగవంతుడికి నీకు ఏది మంచిదో బాగా తెలుసు. అందుచేత ఆయనతో పేచీలు పెట్టుకోవద్దు. అప్పడు నీ మనస్సు సమాధానం పొందుతుంది. మనస్సులో సమాధానం పొందినవారు ధన్యులు, వారు లోకమును స్వతంత్రించుకొందురు అని ఏసు చెప్పారు. నీకు చేతనైన పనిని ఇతరులకు నేర్పు, నీకంటే వారు బాగాచేసేది ఏదైనా ఉంటే వారి దగ్గర నేర్చుకో, దానికి అహంకారం అడ్డురానక్కరలేదు. నేర్పు, నేర్చుకో, ఇది కూడా యోగమే. పార్వతమ్మ వంకాయకూర బాగా వండుతుంది అని అంటే సంతోషించరు. ఏమో అంత బాగా వండుతుందేమో, మనం కూడా నేర్చుకోవటానికి ప్రయత్నం చేద్దాము అని మీకు అనిపించదు. పార్వతిమీద కోపం, ఆ చెప్పినవాడిమీద కోపం, మన బుద్ధి అటువంటిది. ఇటువంటి మనకు మోక్షమా? చిన్న చిన్న బోదులే దాటలేని వారు సంసారసముద్రం ఎలా దాటగలరు. వాడు ఎంత దుర్మార్గుడైనా ఆ దుర్మార్గంతో సంబంధంలేని వస్తువు లోపల ఉంది. ప్రతీ సిన్నర్‌లోకూడా సిన్‌లేని వస్తువు ఉంది. మనం బాహ్యంగా దీనిని చూసే బదులు అది చూస్తే సరిపోతుంది. మీలో ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ మీ మొఖం భగవంతుడివైపు తిప్పితే చాలు ఇవన్నీ కాలిపోతాయి. ఎవరి పరిస్థితి అయినా బాగాలేదు అనుకోండి, వారి మీద మనకు ద్వేషం ఉంటే వారి పరిస్థితి ఇంక మనకు అర్ధమవ్వదు, మన బుద్ధి అర్థం చేసుకోలేదు, మన బుర్ర వాటిని అంగీకరించనివ్వదు. ఈ విషయాలు అన్నీ మనం అర్థం చేసుకోవాలి.

మీ ఇంట్లో వారిమీద మీకు ఎంతో కొంత ప్రేమ ఉంది కదా, ఆ ఇంటికే పరిమితం చేసుకోకండి, ప్రేమ యొక్క వైశాల్యం పెంచండి. మీకు రెండు ఎకరాలు ఉంటే, నాలుగు ఎకరాలు ఎలా చేసుకొంటున్నారో అలాగ ప్రేమ యొక్క వైశాల్యం పెంచండి. శంకరుడు కాని, రామానుజుడు కాని ఇల్లు విడిచిపెట్టారంటే ఇంట్లోవారి మీద కోపం కాదు, వారి ప్రేమను లోకానికి పంచిపెట్టటానికి,

సృష్టినంతా కౌగిలించుకోవటానికి వారు ఇల్లు విడిచిపెట్టారు. ఇంట్లో వారి మీద కోపంతో, ద్వేషంతో ఇల్లు విడిచిపెడితే వాడికి జ్ఞానంరాదు. భక్తి అనేది, ఈశ్వరుడిపట్ల ప్రేమ అనేది లోపల నుండి రావాలి, అది పెర్మనెంట్‌గా ఉంటుంది. ప్రహ్లాదుడిలాగ ఆ భక్తి లోపలనుండి ఉబికి ఉబికి రావాలి. మిమ్మల్ని ఎవరైనా కష్టపెడుతున్నారు అనుకోండి. మనలో ఏమీ పొరపాటులేదుకదా వీరు మనలను ఎందుకు కష్టపెడుతున్నారు అని మీకు అనిపిస్తుంది. భగవంతుడు ఇవన్నీ చూస్తూ ఉంటాడు. మిమ్మల్ని పవిత్రం చేయకుండా మీకు మోక్షం ఇవ్వటానికి అవకాశం లేదు. మిమ్మల్ని ఇష్టంగా చూసేవారిని మీరు ఎలా చూస్తున్నారో, మిమ్మల్ని ఇష్టంగా చూడనివారిని కూడా అలా చూడగలుగుతున్నారా లేదా అని టెస్టింగ్ కోసం కొంతమంది జనాన్ని అలా పెడతాడు. అది మీకు తెలియటం లేదు. వాళ్ళు అందరూ పురుగులు, ఆ పురుగుల చేత మిమ్మల్ని కుట్టిస్తాడు. ఆ పురుగుల మీద మీకు ద్వేషం వస్తోందేమో చూస్తాడు, మీకు ద్వేషం వస్తే మిమ్మల్ని పునర్జన్మలకి పంపేస్తాడు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే కంగారుపడిపోయి, ఆత్మవిశ్వాసం చెడగొట్టుకోనక్కరలేదు, అలా ఆత్మవిశ్వాసం చెడగొట్టుకొంటే అది మీ బలహీనత. సమాజంలో ఎక్కువ విమర్శలకు ద్వేషమే కారణం, అది తెలియక మీ మనస్సును పాడుచేసుకొంటున్నారు.

భగవంతుడు మీకు కేటాయించిన పనిని విడిచిపెట్టిపారిపోవద్దు, ఆ పనిని ఇష్టంగా చేయండి, ప్రేమగా చేయండి, ఈశ్వరునిదయకు పాత్రులయ్యేలాగ చేయండి. మీరు డబ్బు, గౌరవం ఎలా సంపాదించు కొంటున్నారో అలాగ ఈశ్వరుని అనుగ్రహాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయండి, అదే సాధన. మీరు యోగాభ్యాసాలు అనండి, ఆహారనియమం అనండి, ఈశ్వర ప్రణిధానం, అనండి, మానసికతపస్సు అనండి వీటి అన్నింటి యొక్క ప్రయోజనం పరమ పవిత్రులం అవ్వటానికే. వస్తువు నీలోపలే ఉంది. పరమపవిత్రుడికి కాని ఆ వస్తువు గోచరించదు, పరమపవిత్రుడికి కాని దైవసాక్షాత్కారం కలుగదు. పెళ్ళి ఉదాహరణ మర్చిపోవద్దు. ఇంక నాలుగురోజులలో పెళ్ళి ఉందనగా మీ మాట, మనస్సు, చేత పెళ్ళిమీదే ఉంటాయి. పెళ్ళి సక్సెస్ చేయటానికి ఈ మూడూ కలిసి ఉంటాయి. అదేవిధంగా మీ మాట, చేత, మీ మనస్సు కలిసి భగవదనుభవం పొందటానికి అనుగుణంగా ప్రవహిస్తూ ఉంటే మీరు తప్పని సరిగా ఇప్పడే ఇక్కడే ఈ శరీరంలో ఉండగానే భగవదనుభవం పొందుతారు. బాహ్యంగా మిమ్మల్ని అదృష్టం వెంటాడుతున్నప్పటికీ, దురదృష్టం వెంటాడుతున్నప్పటికీ మీకు సబ్జక్టు బాగా అర్థమవుతూ ఉంటే, మీరు శ్రద్ధగా శ్రవణం చేసి లోపలకు ఇముడ్చుకోగలిగితే అలౌకిక సుఖం, అలౌకిక శాంతి, అలౌకిక ఆనందంలో మీరు ఊగిసలాడతారు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-08, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు సెప్టెంబరు ఒకటవ తేది, భగవాన్ శ్రీ రమణమహర్షి పుణ్యక్షేత్రమైన అరుణాచలం విడిచిన రోజు. ఏ జీవుడు స్వతంత్రుడు కాదు. ఈ శరీరం ఏ రోజున, ఏ గంటలో, ఎక్కడ ఉండాలో ఈశ్వరుడు నియమిస్తూ ఉంటాడు. ఈశ్వరుడు ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు. ఎక్కడ ఏది జరిగినా అంతా స్వప్నమే. మన దేహాన్ని అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా అంతా స్వప్నసమానమే. ప్రతీ సంసారంలో కష్టం ఉంటుంది, సుఖం ఉంటుంది, సంతోషం ఉంటుంది, దుఃఖం ఉంటుంది. ఎవరి బాధలు వారివి, అయినప్పటికీ ఇవన్నీ భరిస్తూ మనకు చేతనైనది ఈశ్వరార్పణంగా చేస్తూ ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. మనం ఈశ్వరుని పట్ల ప్రీతి ఏర్పరచుకొని, ఆయన పట్ల గౌరవం పెంచుకొని, భక్తి పెంచుకొని ఆయన దయను పొందటానికి ప్రయత్నం చేయాలి. మిగతావి అన్నీ సెకండరీ. గోదావరికి వరద వచ్చినప్పుడు ఎంత బరువైన వస్తువులైనా ఆ ప్రవాహంలో ఎలా కొట్టుకొనిపోతాయో అలాగే ఈశ్వరభక్తి అనే ప్రవాహంలో మీకు ఉన్న కష్టాలు, ఇబ్బందులు ఎన్ని ఉన్నా అవి ఇబ్బందుల కింద అనిపించకుండా, మిమ్మల్ని ముట్టుకోకుండా అలా కనిపించి వెళ్ళిపోతూఉంటాయి. మీకు తెలిసినా, తెలియకపోయినా ఈశ్వరుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి, మీ పూర్వకర్మననుసరించి ఈ దేహాలను ఆడిస్తున్నాడు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని శరణువేడుకో, ఆయన పట్ల భక్తి కలిగిఉండు, శ్రద్ధ కలిగి ఉండు, అలా జీవిస్తూ ఉంటే ఈ సంసారబాధలనుండి విడిపించి, నీ బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే వాటిని తొలగించి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, అంతకంటే నీకు ఏమి కావాలి.

భగవద్గీత ఉపదేశగ్రంథం, ఆదేశగ్రంథం, వారు ఆదేశిస్తారు. ఇది విధి, ఇది నిషేదం అని స్పష్టంగా చెపుతాడు. ఇలా చేస్తే మీరు బాగుపడతారు, ఇలా చేయకపోతే మీరు పాడైపోతారు అని నేను చెప్పిన విషయాలు అన్నీ అర్థం చేసుకొని తరువాత నీకెలా బాగుంటే అలా చేసుకో అర్జునా అని పరమాత్మ చెప్పినా అదీ ఆదేశమే. శరీరం ఒక కాలంలో వస్తుంది, ఇంకొక కాలంలో కొట్టుకొనిపోతుంది. ఈ శరీరం ఉన్నంతసేపు ఇది ఒక్కటే నిజం అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మనకు ఆ దేహాభిమానం ఉన్నంతకాలం మన మనస్సు విషయానందం మీదకు వెళుతుంది కాని ఆత్మానందం మీదకు రాదు. ఆత్మానందం రుచి

ఒక్కసారి చూస్తేకాని మన మనస్సు విషయానందం మీద నుండి ఆత్మానందం వైపుకు తిరగదు. మనం విషయచింతన చేస్తూ ఆత్మసుఖాన్ని కోరుకొంటాము, అది సాధ్యంకాదు. ఆత్మచింతన చేస్తే ఆత్మసుఖం వస్తుంది, విషయచింతన చేస్తే చివరకు మనకు విషం మిగులుతుంది. శరీరం చనిపోతుంది కాని చావులేని సత్యవస్తువు నీ హృదయంలో ఉంది. నీవు ఏ చదువులు చదువుకొన్నా, ఎక్కడికి వెళ్ళి చదువుకొన్నా సత్యం ఏమిటో తెలుసుకోలేని చదువుకూడా ఒక చదువా అంటున్నాడు పరమాత్మ. ఆ విద్యలు చదువుకోవద్దని చెప్పటంలేదు, వాటి వలన పొట్టవెళ్ళిపోతుంది. నీ విద్యకు సత్యం కేంద్రంగా ఉండాలి. సత్యాన్ని పట్టి ఇవ్వని విద్య కూడా ఒక విద్యా, ఒకవేళ నీవు 90 విద్యలు నేర్చుకొంటావు అనుకో, సత్యవస్తువు గురించి నీకు తెలియదు అనుకో, సత్యం గురించి తెలుసుకోకుండా నువ్వు చనిపోతే నువ్వు అనుభవించే నష్టం ఇట్టిదని నేను చెప్పగలనా. అంటే మీరు ఎంత డబ్బు సంపాదించినా, ఎంత గౌరవం సంపాదించినా ఇవన్నీ లోకానికి సంబంధించినంతవరకు బాగానే ఉంటాయి, ఇవన్నీ స్మశానంతో ఆఖరు. అయితే నీ విద్యకు సత్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని, సత్యాన్ని తెలుసుకొంటే అది నిన్ను ప్రకృతిలో నుండి, సంసారంలోనుండి, మాయలో నుండి, అజ్ఞానంలోనుండి, పునర్జన్మలలోనుండి విడుదల చేస్తుంది. వేసవికాలంలో ఎండలగొడవ, వర్షాకాలంలో వర్షాల గొడవ, శీతాకాలంలో చలిగొడవ, శరీరం వచ్చాక ఈ బాధలు అన్నీ పడాలి. వీటిని అనుభవిస్తూ, వీటిని అతిక్రమించి ద్వైతం లేనిస్థితికి వెళ్ళగలిగితే వీటి పీడ పోతుంది కాని అప్పటివరకు వీటి పీడ వదలదు.

గాఢనిద్రలో నీకు వేరు బుద్ధిలేదు, బుద్ధి చలించినప్పడే వేరుబుద్ధి వస్తోంది. ఈ వేరుబుద్ధిలోనుండే సంసారం వచ్చేస్తుంది. నన్ను నేను కోపగించుకోను. మిమ్మల్ని చూసి కోపగించుకొంటాను. నన్ను నేను పతనమైపోవాలని అనుకోను, మీరు పతనమైపోవాలని నేను అనుకొంటాను. అక్కడ కూడా నువ్వే ఉన్నావన్న సంగతి నీకు తెలియకపోవటం వలన ఇటువంటి భావాలు వస్తున్నాయి. ఎవడైతే పాడైపోవాలని నువ్వు అనుకొంటున్నావో వాడిలో కూడా నువ్వే ఉన్నావు. వాడిపాడు నువ్వు కోరుకొంటున్నావు అంటే నీకు తెలియకుండా నీ పాడు నువ్వే కోరుతున్నావు. ఇదంతా వేరుబుద్ధిలోనుండి వస్తోంది. మనస్సు చలించేటప్పటికి ద్వైతం వస్తుంది. మీ మనస్సు నిదానంగా ఉంది అనుకోండి, మీ మనస్సుకు అసలు చలనమే లేదు అనుకోండి ఇంక రెండో వ్యక్తి అసలు కనబడడు, అసలు రెండోవ్యక్తి ఉన్నాడని కూడా మీకు తెలియదు. గోదానం, భూదానం అని ఇలా దానాలు చేస్తారుకదా అన్ని దానాలకంటే

జ్ఞానదానం ఉత్కృష్టమైనది, ఇది ఆచార్యుడు మాత్రమే చేయగలడు. ఎవరు అడిగినా మాకు శాంతికావాలి, మాకు సుఖం కావాలి అంటున్నారు. ఇంటి నిండా డబ్బు ఉన్నవాడు మాకు శాంతి కావాలి అంటున్నాడు, డబ్బు లేనివాడు శాంతి కావాలి అంటున్నాడు, చదువు ఉన్నవాడు నాకు శాంతి లేదు, నాకు శాంతి కావాలి అంటున్నాడు. దీనికి స్వాములవారు ఏమని చెప్పారు అంటే నిస్పృహః, నిర్మమః, నిరహంకారః అంటే స్పృహలేనివాడు, మమకారం లేనివాడు, అహంకారం లేనివాడు మటుకే శాంతిని పొందగలడు, వాడు మాత్రమే శాంతిని పొందటానికి అర్హుడు. భగవంతుడు ఏ పని అయితే చేయవద్దు అని చెప్పాడో దాని జోలికి వెళ్ళవద్దు. మీ శరీరంతో ఆ పని చేయకపోయినా కొంచం మీ మనస్సు వెళ్ళి ఈగలు వాలినట్లు దాని మీద వాలుతున్నా నీకు శాంతిరాదు అని చెపుతున్నాడు అంటే నువ్వు బయటకు పవిత్రంగానే ఉంటావుకాని లోపల కుళ్ళిపోతావు.

ఈ దేహము నీవు కాకపోయినా ఈ దేహమే నేను అనే తలంపును పెట్టి నిన్ను కట్టేసాడు. మీకు పెద్దలయందు గౌరవంలేదు, తల్లితండ్రులు మీకు అక్కరలేదు, గురువు అక్కరలేదు, శాస్త్రం అక్కరలేదు, ఈతాడు తెంపుకొని వెళ్ళిపోతాను అంటే నిన్ను భగవంతుడు వెళ్ళనిస్తాడా? అంటే నీ బుద్ధిలో ఉన్న దోషాలు తొలగేవరకూ, ఏ కర్మ అనుభవించటానికి ఈ దేహం భూమి మీదకు వచ్చిందో అది పూర్తి అయ్యేవరకు ఈ లోపుగా నీవు కంగారుపడినా దేహము నేను అనే తాడును తెంపడు. దేహప్రారబ్ధం ఎలా ఉన్నప్పటికీ నువ్వు లోపల సత్యాన్వేషణలో కనుక ఉంటే ప్రారబ్ధం అలా జరిగిపోతూ ఉంటుంది, దాని తాలుక ప్రభావం నీ మీద పడదు. భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణం చేయటం వలన, భగవంతుడిని చింతించటం వలన దేహం ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ నీ రోజులు సుఖంగా, శాంతిగా వెళ్ళిపోతాయి. మనోనిగ్రహం లేనివాడికి, ఇంద్రియ నిగ్రహం లేనివాడికి ఎంత శాస్త్రం చెప్పినా వాడికి నిశ్చయ బుద్ధిరాదు. లోపలఉన్న వస్తువు యొక్క శాంతి, సుఖం నీకు ఎంతోకొంత తెలుస్తూ ఉంటే ఇంద్రియాలు, మనస్సు వాటంతట అవే చల్లబడిపోతాయి. ఎవడైనా బాగా డబ్బు సంపాదిస్తే వాడు గొప్పవాడు అంటున్నాము, ఎవడైనా 10 పిహెచ్‌డిలు సంపాదిస్తే వాడిని గొప్పవాడు అంటున్నాము, ఎవడైనా ప్రపంచం అంతా కీర్తి సంపాదిస్తే వాడిని గొప్పవాడు అంటున్నాము. ఇందులో ఎవడూ మహాత్ముడు కాదు, మనోనిగ్రహం ఉన్నవాడు, ఇంద్రియ నిగ్రహం ఉన్నవాడు మాత్రమే మహాత్ముడు, మిగతావారు ఎవరూ మహాత్ములు కాదు అని పెద్దలు చెపుతున్నారు. వాడికి దమ్మిడీ లేకపోయినా, వాడు తాటాకు ఇంట్లో కాపురం ఉన్నప్పటికీ ఎవడికైతే మనోనిగ్రహం ఉందో, ఎవడికైతే ఇంద్రియనిగ్రహం

ఉందో వాడు మాత్రమే మహాత్ముడు, వాడు మాత్రమే మహర్షి, వాడు మాత్రమే ఆచార్యుడు, వాడు ఎక్కడ ఉన్నా బ్రహ్మానందంలో ఉంటాడు, మనం పెద్ద పెద్ద మేడలలో ఉంటున్నా మన మనస్సులో వంకరలు ఉన్నప్పుడు ఏడుస్తూనే ఉంటాము.

మన శరీరాన్ని బట్టతో కప్పకొంటున్నాము అలాగే నేను అనే తలంపు నాది అనే తలంపు ఈ రెండు తలంపులు నీ స్వరూపాన్ని కప్పేసి ఉంచినాయి, అవి కప్పేసి ఉన్నప్పుడు కూడా అది నీవే. దేహము నేను అనే తలంపు పోయింది అనుకోండి, అప్పుడు ఒకవేళ మిమ్మల్ని దుఃఖపెట్టాలన్నా, దుఃఖపడేవాడు అక్కడ ఉండడు, ఎందుచేతనంటే వాడు తాడు తెంపుకొనిపోయాడు. నీ లోపల కోరికలు ఏమి ఉన్నాయో జాగ్రత్తగా చూసుకొంటూ ఉండు. నిన్ను నువ్వు కోరుకోవు, నన్ను నేను కోరుకోను బయట ఉన్న మనుషుల్లో, బయట ఉన్న వస్తువులలో అక్కడ ఏదో కావాలని నీకు ఇష్టం కలుగుతుంది, అది కోరుకొంటున్నావు. అది నీకు వస్తే అది నిన్ను సుఖపెడుతుందని ఒక వాంఛ. కాని కాలప్రవాహంలో అది ఉండగా నువ్వు అయిపోతావు, నువ్వు ఉండగా అది అయినాపోతుంది. అందులో కూడా సుఖం లేదని అది నీ దగ్గరకు వచ్చాక నీకు తెలుస్తుంది. శాంతి అనేది, సుఖం అనేది బయట ఎక్కడా లేదు, అది మన హృదయంలోనే ఉంది. మనం లోపలకు వెళ్ళటం మానేసి, మన హృదయంలో మనం వెతుక్కోవటం మానేసి సుఖంకోసం, శాంతికోసం బయట వెతుకుతున్నాము. ఇలా సుఖం లేనిచోట, శాంతిలేనిచోట ఎన్ని జన్మలు వెతికినా నీకు సుఖం, శాంతి లభ్యం కాదు. ఆచార్యుడి అనుగ్రహం లేకుండా విద్య సంపాదించాలనే బుద్ధి కూడా మనకు కలుగదు. మౌనం విరామం లేని సంభాషణ. అంటే హృదయం హృదయంతో మాట్లాడుతూ ఉంటే మాటలతో పని ఏముంది. మౌనం ద్వారా విషయం అర్థం కాకపోతే మాటలు అవసరంకాని, మౌనం ద్వారా అర్థమవుతూ ఉంటే మాటలతో పనిలేదు.

పాపం చెయ్యకూడదు, పాపం చెయ్యకూడదు అనుకొంటున్నాను కాని చెయ్యటం మానటం లేదు. దీనికి కారణం ఏమిటి అని అడిగితే, దీనికి కోరిక కారణం అని పరమాత్మ చెప్పాడు. నీ బుద్ధి ఆత్మను ధ్యానం చేస్తూ ఉంటే కోరిక పుట్టదు. నువ్వు స్వరూపధ్యానం ఎప్పుడైతే విడిచిపెట్టేసావో అప్పుడు ఆ వస్తువు మనకు వస్తే సుఖపడిపోతాము, ఈ వస్తువు మనకు వస్తే సుఖపడిపోతాము అనేటువంటి బుద్ధి వస్తుంది. మనస్సు చలించటం వలన కోరిక వస్తుంది, మనస్సు చలించకపోతే అసలు కోరికరాదు. ఏదో అది నిన్ను సుఖపెడుతుందని కోరుకొంటున్నావు, నీ కోరిక నెరవేరితే గర్వం, నెరవేరకపోతే దుఃఖం,

అటైనా పాడైపోతావు, ఇటైనా పాడైపోతావు, రెండింటిలోను మన స్వరూపానికి దూరమై పోతాము. స్వర్గరాజ్యం నీ హృదయంలో ఉంది, దానికి నువ్వు అధిపతివి కావాలి. ఇక్కడ బెర్తులు రిజర్వు చేసుకొని హైదరాబాద్ వెళ్ళిపోతున్నారు. అలాగే మీ జీవితవిధానంలో మార్పు తెచ్చుకొని, ఏ రకంగా జీవిస్తే భగవంతుడి కృపకు పాత్రులవుతామో, ఏ రకంగా జీవిస్తే మనకు స్వర్గరాజ్యంలో చోటు ఇస్తాడో ఆ రకంగా జీవిస్తూ చనిపోయినతరువాత స్వర్గరాజ్యానికి వెళ్ళటానికి ఇప్పుడు బతికిఉండగానే మీ బెర్తు రిజర్వు చేసేసుకోండి, అప్పటికప్పుడు మీకు బెర్తులు దొరకవు. ప్రాణం పోయే టైములో అసలు మనస్సు చలించకూడదు, భగవంతుడి స్మరణ తప్పించి ఇంకో స్మరణ రాకూడదు. అప్పుడు వాడు తరిస్తాడు. ఇప్పటినుండి మనం దైవచింతనలో ఉంటే, ఆత్మచింతనలో ఉంటే అది సాధ్యమవుతుంది కాని లేకపోతే సాధ్యంకాదు. మన జీవితంలో వివేకం, వైరాగ్యం ఇవి రెండూ విడిచిపెట్టకూడదు. ఆత్మజ్ఞానసముపార్జనకు ఇవి రెండూ సహాయం చేస్తాయి. ఏదైనా ఒక పని మనం చేసేటప్పుడు ఆ పని మనం చెయ్యవచ్చా, చెయ్యకూడదా, ఇది ఆత్మాజ్ఞాన సముపార్జనకు ఎంతవరకు ఉపయోగపడు తుంది అని చూసుకోవాలి. మనం వైరాగ్యాన్ని కూడా బాగా ప్రాక్టీసు చెయ్యాలి. వైరాగ్యం లేకుండా ఆత్మజ్ఞానం సాధ్యం కాదు.

శిష్యురాలిని గురువు తీర్చిదిద్దటంకాదు, గురువును తీర్చిదిద్దిన శిష్యురాలు, అటువంటి శిష్యురాలు నాకు దొరికింది. ఒక అమ్మగారు నా దగ్గరకు వచ్చి కళ్ళకు ఆపరేషన్ చేయించుకొందామ అనుకొంటున్నాను అని చెప్పారు. దానికి ఎంత తెచ్చుకోమన్నారు అని అడిగితే మూడువేలు అని చెప్పారు. మూడువేలు తీసుకొనివెళ్ళి ఆపరేషన్ చేయించుకోండి అని ఇస్తే ఆవిడ పట్టుకెళ్ళారు. ఆవిడ ఇంటికి వెళ్ళేటప్పటికి కూతురు చూడటానికి వచ్చింది. ఎక్కడికి వెళ్ళావు అంటే నాన్నగారి ఇంటికి డబ్బు తెచ్చుకోవటానికి వెళ్ళాను అని చెప్పింది. అప్పుడు కూతురు ఏమి చెప్పింది అంటే నీకు బుద్ధిలేదు, పూర్వం అనేకసార్లు మనకు సహాయం చేసారు. అప్పుడు మనకు అవసరం కాబట్టి చేసారు. ఇప్పుడు మన పరిస్థితి బాగుంది. నువ్వు అలవాటును బట్టి వెళ్ళి అడిగేస్తున్నావు. అవసరమైనప్పుడు అడగవచ్చు, అవసరంలేనప్పుడు అడగటం అది లగ్జరీ. ఇప్పుడు నువ్వు నాన్నగారిని అడగవు అనుకో, ఈ మూడు వేలు ఎవరికి అవసరమో వారికి ఇచ్చేవారు కదా. అందుచేత నువ్వు వెంటనే నాన్నగారి దగ్గరకు వెళ్ళి ఈ డబ్బు ఇచ్చేయి. అంతగా నీకు కావాలంటే నాన్నగారి అనుగ్రహం కింద రు॥ 500 దగ్గర పెట్టుకో. మిగతా 2500 తీసుకొనివెళ్ళి నాన్నగారికి ఇచ్చేయి అని చెప్పి పంపింది. ఆవిడ వచ్చేటప్పటికి నేను ఇంటి

దగ్గర లేను, ఈ గాధ అంతా చెప్పి మా ఇంటిలో ఇచ్చేసి వెళ్లిపోయారు. అప్పుడు నేను అనుకొన్నాను గురువును తీర్చిదిద్దిన శిష్యురాలు అనుకొన్నాను. అవసరం లేని వస్తువులు అన్నీ తెచ్చుకొని ఇంటిలో పెట్టుకొని, వాటిని దులుపుకోవటం, వాటికి కాపలా కాయటం, ఇలా కాలాన్ని వృధా చేసుకొనే బదులు దేవుని పఠం దగ్గర కూర్చొని ధ్యానం చేసుకొంటే మనస్సు అంతర్ముఖమవుతుంది. డబ్బు ఉందని అవసరాలు పెంచుకోకూడదు. అన్నీ ఉన్నాయి అని ఎగిరి ఎగిరిపడకూడదు, అన్నీ ఉన్నా అణిగి ఉండండి.

శిష్యుడు ఏమీ ప్రయత్నం చేయనక్కరలేకుండా గురువు యొక్క సన్నిధిలో గురువు యొక్క మౌనం వల్లనే అతనికి ఆత్మజ్ఞానం కలుగుతుందా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే మహాత్ముల సన్నిధిలో వాసనలు అణుగుతాయి, మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది. జ్ఞానిది అమనస్కస్థితి. మనం ఏదో చిన్న చిన్న ప్రయత్నాలు చేస్తాము. జీవుడికి శక్తి లేదు, శక్తి అంతా పరమాత్మదే. ఈ జీవుడిని తనలోనికి తీసుకోవటానికి ఆ కెరటం అటువైపు నుండే రావాలి. మహర్షుల సన్నిధిలో మనస్సు నిర్మలమవ్వటమేకాదు, పవిత్రమవటమేకాదు, నీకు సమాధిస్థితి కలుగుతుంది. సమాధి స్థితిలో వాడికి నీవు నేను అనే భేదబుద్ధి పోతుంది, అప్పుడు ఆత్మానుభవం కలుగుతుంది. ఎంతో పునాది ఉంటేగాని సమాధిస్థితి రాదు. రామకృష్ణుడు ఏమన్నారు అంటే నేను సమాధి స్థితిలోనికి వెళ్లిపోతున్నాను. నేను సమాధిస్థితిలో ఏదైతే అనుభవించానో మరల మీకోసం కిందకు దిగివచ్చి చెపుతున్నాను. కిందకు రావటం ఇష్టంలేకపోయినా మీకోసం వస్తున్నాను అన్నారు. మీరు ఎవరికైనా ఉపకారం చేస్తున్నారు అనుకోండి, మీకు మీరే చేసుకొంటున్నారు. ఎవరికైనా అపకారం చేస్తున్నారు అనుకోండి మీకు మీరే అపకారం చేసుకొంటున్నారు. అది ఇప్పుడు మీకు తెలియదు, అమృతానుభవం వచ్చాక తెలుస్తుంది. భగవంతుడికి మన మీద దయకలిగి మనలను ఆయన ఒడిలోనికి తీసుకోవాలి కాని బాహ్యంగా మనం చేసే సాధనల వలన ఇది సాధ్యం కాదు, ఆయన అనుగ్రహించవలసిందే. మనం ఏదైనా ఒకమాట మాట్లాడినా, ఒక పనిచేసినా ఈశ్వరప్రీత్యర్థం చేయాలి. ఈశ్వరుడి ప్రేమను మీరు సంపాదించుకోవాలి అది ఈశ్వరభక్తి లేకుండా సాధ్యం కాదు. ఏవో వాసనలు అణగటం, తలంపులు అణగటం కాదు, పూర్తిగా పోవాలి, మనోనాశనం అవ్వాలి. మహాత్ముల సమక్షంలో సమాధిస్థితి కలగటమే కాదు, డైరెక్టుగా బ్రహ్మానుభవమే కలుగుతుంది.

మీకు ఒక కోరిక నెరవేరిందా, నెరవేరిన కోరిక అనేక కోరికలను తీసుకొని వస్తుంది,

అది సహజం. అనేక కోట్ల శరీరాలు ఈ భూమి మీదకు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. కాని కోరికలు నెరవేర్చుకొంటూ, కోరికలు నెరవేర్చుకొంటూ కోరికలు లేని స్థితిని పొందినవాడు ఇంతవరకు సృష్టిలో ఒక్కడూ లేడు అని పరమాత్మ చెప్పాడు. గౌరవాలు అగౌరవాలు, సుఖ దుఃఖాలు, చావులు పుట్టుకలు, లాభనష్టాలు ఇవన్నీ ద్వైతాలు. వాటిని సహించటం నేర్చుకొంటాము అనుకోండి, ఈ ద్వైతాల మధ్యన ఉండి అద్వైతస్థితిలోనికి వెళ్ళిపోతాము. గురువుకు అంతా సాధ్యమే. గురువు ఈ మధ్య మనకు కనబడటంలేదు, మనకు ఏమీ చేయటం లేదు అని ఒకోసారి గురువును తిడుతూ ఉంటాము. ఇన్ని గొడవల మధ్యన కూడా గురువు వికారం లేకుండా ఉంటాడు. ఎందుచేతనంటే ఆయన నిర్వికారస్థితిలో ఉన్నాడు కాబట్టి ఆయనకు వికారం రాదు. మన శరీరం చనిపోయినప్పడు గురువుతో అనుబంధం తెగిపోదు, అది అలా కంటిన్యూ అవుతుంది. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మనం పొందేవరకు జన్మజన్మలకు మనలను వెంటాడతాడు. ఒకోసారి అలౌకికమైన ఆనందం వచ్చి మనలను ముంచేస్తూ ఉంటుంది, ఉక్కిరిబిక్కిరి అయిపోతాము. అది మన సాధనల వలన, మన తెలివితేటల వలన రావటం లేదు, గురువు అనుగ్రహం వలననే ఈ ఆనందాన్ని పొందుతున్నాము అని మనకు తెలుస్తూ ఉంటుంది. మానవతా సంబంధాలు అన్నీ నూటికి నూరుపాళ్ళు స్వార్థపూరితమైనవి. ఒక్క భగవంతుడితోటి మనకు ఉన్న సంబంధంలో స్వార్థంలేదు. ఈశ్వరుడితో మనకు ఉన్న అనుబంధమే నిజమైన ప్రేమ. అందుచేత చిల్లరచిల్లర గొడవలలోనికి వెళ్ళి మన మనస్సును పాడుచేసుకొనే బదులు ఈశ్వరుని దయను సంపాదించటానికి పనిచేస్తే ఆయన దయకు అన్నీ సాధ్యమే కాబట్టి మనకు ఆత్మజ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు. మనకు ఆత్మసుఖం దొరికే వరకూ మన మనస్సు విషయసుఖాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఆత్మసుఖం తెలిసాక ఇంక ఇటువైపు తిరగదు. నువ్వు బ్రాహ్మీస్థితి పొందావా ఈ ప్లానెట్‌లోనే కాదు, ఏ లోకంలో అయినా సరే నిన్ను ఆకర్షించే షాడో కనబడదు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 09-11-08, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు సంబంధించినంతవరకు ఈ ప్రవచనాలు మనకు స్వధర్మం, ఈ సన్మానాలు అవి మనకు పరధర్మం. మన అతఃకరణ ప్రవృత్తికి అనుకూలమైన పనులు చెయ్యాలి. ఏదో మర్యాదలకోసం మన అంతఃకరణ ప్రవృత్తికి విరుద్ధమైన పనులు చేస్తే అది పరధర్మం. మనం

ఏదైనా పనిచేసేటప్పుడు ఎవరో చేస్తున్నారని ఆ పనులు చేయకూడదు. అది మన అతఃకరణానికి అనుకూలంగా ఉందా, భవిష్యత్‌లో దీని పర్యవసానం ఎలా ఉంటుంది, దీని వలన మనకు శాంతి వస్తుందా అని ఇవి అన్నీ ఆలోచించుకొని పనులు చేస్తే అది స్వధర్మం. ఇలా కాకుండా ఎవరో చేస్తున్నారు అని మనం కూడా అవి చేయటం పరధర్మం అవుతుంది. పరధర్మం దుఃఖాన్ని ఇస్తుంది, స్వధర్మం సుఖాన్ని ఇస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మనం తరించాలి అంటే దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టేయాలి. మన దేహం ఎంత నిజమో ప్రారబ్ధం కూడా అంతే నిజం. దేహం ఏ రోజున పుట్టాలి, ఏ రోజున చనిపోవాలి అన్నది కూడా ప్రారబ్ధాన్ని బట్టే ఉంటుంది. ఇవన్నీ మనం పుస్తకాలలో చదువుతాము కాని మనకు నమ్మకం కుదరదు, మనం అదరం విశ్వాసహీనులం. లోకంలో అనేక విద్యలు ఉన్నాయి. ఆత్మవిద్య మాత్రమే సత్యవిద్య. దీనిని సత్యవిద్య అని ఎందుకు అన్నారు అంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని పట్టి ఇస్తుంది కాబట్టి దానిని సత్యవిద్య అన్నారు. ఆత్మవిద్యను నేను అని పరమాత్మ గీతలో చెప్పాడు. మిగతావి అన్నీ లోకానికి సంబంధించిన విద్యలు. నీ దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో ఆ విద్యలు కూడా అంతే నిజం. దేహాభిమానం ఉన్నవారు అందరూ పశువులే. శివుడు పశుపతి. పశుబుద్ధిని పోగొట్టేవాడే పశుపతి. వాడిని ఆశ్రయిస్తేనేకాని పశుబుద్ధి పోదు, పశుబుద్ధి పోతేగాని ఆత్మబుద్ధి కలుగదు.

మనకు భగవదనుభవం రాకుండా ఎవరో అడ్డువస్తున్నారు అని మనకు అనిపిస్తుంది. ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు. మన రూపబుద్ధి, నామబుద్ధే మనకు అడ్డు వస్తోంది. నేను ఆ మంచి పని చేసాను, ఈ మంచి పని చేసాను, అది సాధించాను, ఇది సాధించాను అని మనం ఎక్కువగా అనుకొంటూ ఉంటాము. ఈ అనుకోవటాలే మనకు అడ్డు వస్తున్నాయి. వీటిని ఊడగొట్టుకోవటం మానేసి మనం ఏదో పొందాలి, ఏదో పొందాలి అనుకొంటున్నాము. వీటిని ఊడగొట్టుకొంటేనేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. జపం చేద్దాము, ధ్యానం చేద్దాము ఏదో పొందేద్దాము అనుకొంటున్నాము కాని అసలు ఉన్నవి పోగొట్టుకోవటం మనకు చేతకావటం లేదు. అసలే మనం అప్పుతోటి ఉన్నాము, ఇంకా అప్పు పెంచుకోవాలి అని చూస్తున్నాము. మనం పోగొట్టుకోవలసినవి చాలా ఉన్నాయి. పోగొట్టుకోవలసినవి పోగొట్టుకొంటే ఉన్నది ఇక్కడే ఉంది. బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది, అది నీవై ఉన్నావు, నిన్ను నీవు ఏమి సంపాదించుకొంటావు. అది సంపాదించేది కాదు. దైనందిన జీవితంలో మన ప్రవర్తన బాగుంటే దానికి మన మీద దయకలిగి, మన పట్ల అనుగ్రహం చూపించి

ఏదో ఒకరోజున ఏదో క్షణాన నీకు ఎరుకలోనికి వస్తుంది, అది నీ కడసారి జన్మ. అది మీకు ఎరుకలోనికి వచ్చినప్పుడు ఒకచేయి రెండవచేయిని ముట్టుకొన్నప్పుడు ఆ స్పర్శ ఎలా తెలుస్తుందో అంత స్పష్టంగా ఆ వస్తువు తాలుక వైభవం నీకు తెలుస్తుంది, ఆ వస్తువు నీకు అనుభవంలోనికి రావటమే కాదు, అది నీవే అన్న సంగతి కూడా నీకు తెలుస్తుంది.

మనం వినేది నిజంకాదు, చూచేది నిజంకాదు, మనం ఆలోచించేది నిజంకాదు, మనం ఊహించేది నిజంకాదు. ఎందుచేతనంటే అసలు వస్తువు మనం చూడటానికి అతీతం, వినటానికి అతీతం, ఊహించటానికి అతీతం అది ఎవరో అనుకోవద్దు, అది మనమై ఉన్నాము. మనకు లోచూపు లేకుండా ఆ వస్తువు మనకు ఎరుకలోనికి రాదు. మీకు ఉన్న ధనాన్నిబట్టి అది బజారులో కొనుక్కొనేది కాదు. మీకు బాహ్యంగా ఎన్ని కోట్లు ఉన్నా వాటిని హృదయంలోనికి రానివ్వకూడదు. బయట గొడవలు అన్నీ బయటే ఉంచాలి, వాటిని లోపలకు రానివ్వకూడదు. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే బాగా కాలిన ఇనుము మీద మీరు నీటిబొట్టు వేస్తే ఆ నీటి బొట్టు నామరూపాలు లేకుండా కాలిపోతుంది. అలాగే విచారణ చేసి మీ నామరూపాలను పోగొట్టుకోవాలి. అర్జునా! నువ్వు ఏమనుకొంటున్నావు అంటే ఈ భీష్ముడిని చంపటం ఎలాగ, ద్రోణాచార్యులను చంపటం ఎలాగ అని నీవు అనుకొంటున్నావు, నువ్వు ఎవడవు చంపటానికి. నేను కాలరూపంలో ఉన్నాను. ఆ కాలం వచ్చేటప్పటికి వారి ప్రాణాలను పట్టుకొనిపోతాను. నువ్వు వూరికే చేతులు ఆడించు, అర్జునుడు జయించాడు అని లోకం చెప్పకొంటుంది. ఇది మనం చదువుతాము కాని ఎన్నిసార్లు చదివినా మనకు అర్థంకాదు. దీనికి కారణం మనకు ఈశ్వరుడిపట్ల ఉండవలసినంత విశ్వాసం లేదు. నోరు ఏమో భగవంతుడు ఉన్నాడని చెపుతుంది, మనస్సు లేడు అని చెపుతుంది. ఎందుచేతనంటే నీకు అర్హత లేదు, యోగ్యత లేదు, నీ మనస్సుకు ట్రైనింగ్ లేదు. మీరు భక్తులేగాని లోక విషయాలు విన్నంత శ్రద్ధగా భగవంతుడు చెప్పిన మాటలు వినరు.

లోకం అంటే ఏమీ లేదు, రూపాలు నామాలు క్రియ ఈ మూడు కలిపితే లోకం, ఈ మూడూ తీసేస్తే లోకం లేదు. మనకు ఈశ్వరుడిపట్ల ప్రేమ ఉండాలి, విశ్వాసం ఉండాలి, ఇవి మనకు లేవు. మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం, మంచిదే. అలాగే ఈశ్వరుడిపట్ల అంతప్రేమ మీకు ఉందా? ఆ ప్రశ్న మీరు వేసుకోవాలి. మీరు ఏదైనా మాట్లాడేటప్పడు అక్కడ హృదయం ఉండాలి. ఏదో జనరల్‌గా అందరూ మాట్లాడుతూ ఉంటారు. అక్కడ

మాట వేరుగా ఉంటుంది, వారి ఆలోచన వేరుగా ఉంటుంది, చేసేపని వేరుగా ఉంటుంది, అక్కడ హృదయం ఉండదు, అంటే త్రికరణశుద్ధి ఉండదు, సమన్వయం ఉండదు. లోకానికి సంబంధించిన గౌరవాలు సంపాదించాలని ఏదో లోపల ఉంటుంది. త్రికరణశుద్ధి లేనివాడికి ఎవడికీ జ్ఞానం రాదు. మీ స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం అని గీతలో పరమాత్మ చెప్పాడు. మీ స్వభావం మారాలంటే మీ మనస్సును, మీ దేహాభిమానాన్ని అగ్నిలో కాల్చాలి. మనం ఒక మాట మాట్లాడితే, చేతితో ఒకపని చేస్తే, మన మనస్సులో ఏదైనా ఆలోచన వస్తే అది ఇంపెర్సనల్‌గా ఉండాలి, అప్పుడు మనం పవిత్రులం అవుతాము, ఇది మనం జాగ్రత్తగా చూసుకోవాలి. మనం చేసే పని నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి. ఇతరులు మనలను గుర్తిస్తున్నారా లేదా అని మనం ఆలోచిస్తే మీకు కోటి జన్మలు ఎత్తినా జ్ఞానం రాదు. అజ్ఞానానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానానికి ఇతరులు లేరు. ఉన్నది ఒక్కటే, జ్ఞాని దానినే చూస్తూ ఉంటాడు, ఇంకవాడికి పేచీ ఏమి ఉంటుంది. రెండు కనిపిస్తూ ఉంటే భయం, కోరిక, అశాంతి, ద్వేషం అన్ని వికారాలు వస్తాయి. ఉన్నది ఒక్కటే అయినప్పుడు, లోకం అంతా తానే కనిపించినప్పుడు వాడికి వికారం ఏముంటుంది, ద్వేషం ఏముంటుంది. భయం ఏముంటుంది. శ్రద్ధ అంటే మన రాగద్వేషములను ఒక ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పిన మాట మీద నూటికి నూరుపాళ్ళు మనకు నమ్మకం కుదిరితే అది శ్రద్ధ. అటువంటి శ్రద్ధ మీకు కలిగితే అదే జ్ఞానానికి దారి చూపిస్తుంది. అటువంటి శ్రద్ధను మనం సంపాదించాలి, మిగిలినవి అన్నీ సెకండరీ, అన్నీ స్వప్నసమానమే. అందరి హృదయాలలో అంతర్యామిగా నేను ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు కదా, ఆ మాట మీద మనకు పూర్తి విశ్వాసం కుదిరితే నీకు మోక్షానికి ఎలిజిబిలిటీ వస్తుంది.

మీరు ఈశ్వరుడిపట్ల ప్రేమగా ఉండండి, భక్తిగా ఉండండి, ఏ సాధన చేయండి, వీటి అన్నింటి యొక్క గమ్యం ఒక్కటే, మనం పవిత్రులం అవ్వాలి. పరిశుద్ధుడు కానివాడు, పవిత్రుడు కానివాడు పరిపూర్ణత ఎలా పొందుతాడు అంటాడు ఏసు. అంటే పొందలేడు. ప్రారబ్దాన్ని బట్టి శరీరానికి సంబంధించిన కష్టాలు ప్రతిజన్మలోను ఉంటాయి. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి లోచూపు నేర్చుకొని లోపల ఉన్న సద్వస్తువును పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు హిమాలయాలకు వెళ్ళినా, కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా నీ పాడుమనస్సు నీ కూడా వస్తుంది, అది జ్ఞాపకం ఉంచుకోండి. దేహం ఎక్కడ ఉంటే ఏముంది, నువ్వు మారుమనస్సు పొందాలి, అది ముఖ్యం. భగవంతుడు మనకు బాగుపడే మాటలే చెపుతాడు కాని పాడయ్యే మాటలు

ఎందుకు చెపుతాడు, ఆయన మన దగ్గరనుండి ఆశించేది ఏమీలేదు. బంగారం చాలా గొప్పది అని మనం అనుకొంటాము, ఆయన దృష్టిలో అది మట్టితో సమానము. నీ హృదయంలో సద్వస్తువు ఉంది అని పెద్దలు చెపుతున్నారు. నాకు నమ్మకం ఉంది కాని అది గోరువెచ్చని నీళ్ళులాగ ఉంది, నాకు పూర్తి నమ్మకం ఎలా కలుగుతుంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీ మనస్సు ఇంకా పక్వానికి రాలేదు. తొందరపడవద్దు. మనం సాధన స్లోగా చేసుకొంటూ రావాలి. ఈ కాయను ఎప్పడు తినేద్దామా అని పచ్చికాయను ముగ్గేస్తే అది కుళ్ళిపోతుంది, నోటిలోనికి వెళ్ళేబదులు పెంటమీదకు వెళ్ళిపోతుంది. మనం నెమ్మదిగా విశ్వాసం పెంచుకొంటూ రావాలి, సజ్జనసాంగత్యం చేస్తూ ఉండాలి. మనం బాగుపడుతాము, బాగుపడే రోజులు వస్తాయి అనే విశ్వాసం విడిచిపెట్టకూడదు. జరిగిపోయిన గొడవలు అన్నీ మర్చిపోయి నువ్వు విచారణ చేస్తూ ఉండు.

నీకు ఎంత చదువు ఉన్నా, డబ్బు ఉన్నా వాటిని ఇముడ్చుకోవాలి, సామాన్యంగానే కనబడాలి, ఎన్ని ఉన్నా వినయం విడిచిపెట్టకూడదు. వాటిని ఇముడ్చుకోలేకపోతున్నారు అనుకోండి, అస్తమాను కక్కేస్తున్నారు అనుకోండి, మీ స్వరూపానికి దూరమైపోతారు. ఈ డబ్బు, చదువు, కీర్తి మీ దేహప్రారబ్ధంలో ఉంటే వచ్చేస్తాయి, వాటిని ఎవరూ ఆపుచేయలేరు. ఇప్పడు గాలి వీస్తోంది అనుకోండి, ఈ బిల్డింగ్‌లో ఉన్న జనం దగ్గరకు గాలి రాకూడదు అని నా చెయ్యి అడ్డుపెడితే ఆగుతుందా, ఆగదు. అలాగే మీ దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వచ్చేస్తుంది, మీ మీద అసూయ పడేవారు అడ్డుపెట్టినా ఆగదు. మా అబ్బాయికి సంబంధాలు వస్తున్నాయండి, ఊళ్ళోవాళ్ళు కొంతమంది చెడగొట్టేస్తున్నారు అని ఈ మధ్య ఒకరు నాతో చెప్పారు. నేను ఏమి చెప్పాను అంటే మీ అబ్బాయికి పెళ్ళి అయ్యే టైము వస్తే ఊళ్ళో వాళ్ళు అందరూ కలిసి చెడగొట్టినా పెళ్ళి ఆగదు. పెళ్ళి ఆపుచెయ్యటానికైనా, చెయ్యటానికైనా వాళ్ళు ఎవరు? భగవంతుడి సంకల్పం బలీయమైనది. ఎన్ని లక్షలమంది దానికి వ్యతిరేకంగా ఉన్నా అది జరిగిపోతుంది. అయితే భగవంతుడికి ఉన్న శక్తి మనకు తెలియకపోవటం వలన వాళ్ళు చెడగొట్టారు, వీళ్ళు చెడగొట్టారు అనుకొంటున్నాము. ఈశ్వరుడిపట్ల మనకు విశ్వాసం లేకపోవటంవలన ఇటువంటి సందేహాలు వచ్చి మనస్సును పాడుచేస్తాయి. దేనికి మనం కంగారుపడకూడదు. ఏది ఎప్పడు జరగాలో అది అప్పడు జరుగుతుంది.

ఆత్మజ్ఞానసముపార్జనకోసం శారీరకఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి, ఆరోగ్యమే ఆనందం. పూర్వపు విషయాలను గోడకట్టినట్లుగా మర్చిపో. వర్తమానకాలాన్ని సద్వినియోగం

చేసుకో. మీ ఇంట్లో ఒక గది చాలా సంవత్సరాలనుండి చీకటిగా ఉంది అనుకోండి. మీరు ఒక దీపం వెలిగిస్తారు అనుకోండి. చీకటి నేను పోను అని అంటుందా? మీరు దీపం వెలిగించగానే చీకటి పోతుంది. అలాగే భగవాన్ చెప్పేది ఏమిటి అంటే కొన్ని వేల జన్మలనుండి మీలోపల అజ్ఞానం ఉండవచ్చు. కాని మీరు విచారణ చేస్తే, ఈశ్వరుడిపట్ల విశ్వాసం పెంచుకొంటే మీ లోపల జ్ఞానదీపం వెలిగినప్పుడు అజ్ఞానం పటాపంచలైపోతుంది. అంతేగాని నేను వెయ్యిజన్మలనుండి నీ కూడా ఉన్నాను, ఇవాళ ఎక్కడికి పోతాను అని అనదు, అది అబద్ధం కాబట్టి వెంటనే పోతుంది. మనం నమ్మినా, నమ్మకపోయినా శాస్త్రం నిజం. అది నిజం అని నమ్మటానికే వందలాది సంవత్సరాలు తపస్సు చేయటం. శరీరం, మాట, మనస్సు అన్నీ తపోమయం అవ్వాలి. మనం వ్యక్తిభావనతో పనిచేయటానికి అలవాటుపడిపోయాము. మనం ఏమాటమాట్లాడినా, ఏ పని చేసినా వ్యక్తిభావన లేకుండా చెయ్యాలి. అసలు వ్యక్తి అక్కడలేడు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా తెలియకపోవటం వలన లేనివాడిని ఉన్నాడు అనుకొంటున్నాము. ఉన్నది ఉన్నట్లుగా మనకు తెలిసేవరకూ ప్రతిజన్మలోను ఇలా లేనిది ఉందని అనుకొంటూనే ఉంటాము.

అందరూ బాగున్నారు, సంసారం బాగుంది, రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని అనుకొంటాము. మనందరము వలలో పడ్డ చేపలం అన్నారు రామకృష్ణుడు. వలలో పడ్డ చేపలు అనుకొంటాయట వలలో పడితేపడ్డాము, నీళ్ళు ఉన్నాయి, ఈదుతున్నాము, వలలో పడితే మనకు వచ్చే నష్టం ఏమిటి అని కేరింతలు కొడతాయి, కాని ఇంకో గంటలో దాకలోకి వెళ్ళిపోతాము అని వాటికి తెలియదు. మనం కూడా అలాగే ఉన్నాము అన్నారు రామకృష్ణుడు. మాకు బాగా రోజులు వెళ్ళిపోతున్నాయి అంటే ఏమి చూసి మనకు గర్వం? గర్వం పొందటానికి ఈ సృష్టిలో ఏముంది? నీ పని చాలా బాగా ఉన్నా అదీ స్వప్నమే, బాగా లేకపోయినా అదీ స్వప్నమే. యమధర్మరాజు దగ్గర నుండి పిలుపు ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు, ఆ పిలుపు వచ్చేవరకు అలా సంతోషంగానే ఉండండి, మీ సంతోషం నేను చెడగొట్టటం ఎందుకు అన్నారు. భగవంతుడు ప్రతి జన్మలోను మనకు ఏదో శరీరం ఇస్తాడు. ఆ శరీరమే మనం అనుకొని ఇలా తిరుగుతూ ఉంటాము. మనకు పుణ్యబలం లేకపోతే సత్పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధి కూడా మనకు కలుగదు. లోపల ఉన్న సత్యవస్తువును వదిలేసి అజ్ఞానం వెంటపడవద్దు. లోపల అజ్ఞానంలో ఉన్నప్పుడు, లోపల అవిద్యలో ఉన్నప్పుడు, లోపల బంధంలో ఉన్నప్పుడు వాడు డబ్బున్నా మూర్ఖుడే, వాడికి చదువు ఉన్నా మూర్ఖుడే. బయట డబ్బు

ఉంటుంది, చదువు ఉంటుంది కాని లోపల వాడి స్వభావం ఎక్కడికి పోతుంది. ప్రపంచంలో ఎవడు పనిచేసినా ఏదో కోరిక పెట్టుకొని చేస్తాడు, అలవాట్లను సంతృప్తిపరచుకోవటానికి పని చేస్తాడు, అలవాట్లకోసం డబ్బు సంపాదిస్తూ ఉంటాడు. సాధకులు తిండి దగ్గర, బట్ట దగ్గర జాగ్రత్తగా ఉండాలి. అర్హతకు మించి ఖరీదైన బట్టలు కొనకూడదు. మీకు అలవాట్లు లేవు అనుకోండి మీకు తిండికి, బట్టకు ఎంత అవుతుంది, పెద్ద ఎక్కువ ఏమీ అవ్వదు. అలవాట్ల వలననే డబ్బు పాడైపోతుంది. మీకు అలవాట్లయొక్క వేగం తగ్గితే లోపల సత్యవస్తువు ఉందో లేదో మీకే తెలుస్తుంది. సత్కర్మ, నిష్కామకర్మ భగవంతుడు ఎందుకు పెట్టాడు అంటే ఒకేసారి మనకు ధ్యానస్థితిరాదు.

మనస్సుకు నెమ్మదిగా నచ్చజెప్పి దాని మార్గాన్ని మార్చాలి, నరకానికి వెళ్ళే మార్గం నుండి దానిని మోక్షం వైపుకు తిప్పాలి. ఇప్పడు మీరు నిడదవోలు వెళ్ళే రైలులో కూర్చొని భీమవరం రావటం లేదు అంటే భీమవరం ఎలా వస్తుంది. మీరు నరకానికి వెళ్ళే మార్గంలో ఉండి మోక్షం ఎప్పడు వస్తుంది అని కనిపెట్టుకొని ఉంటే, మోక్షం రానేరాదు. భీమవరం వెళ్ళే రైలులో కూర్చొంటే ఒక గంట ఆలస్యం అయినా భీమవరం చేరుస్తుంది. అలాగే ముందు మీ గమ్యాన్ని నిర్ధారించుకొని మనస్సు ఆ వైపుగా ప్రయాణం చేసేటట్లు దానికి ట్రైనింగ్ ఇవ్వండి. మనస్సుకు నచ్చజెప్పి మోక్షం అనే రైలులో కూర్చోబెట్టండి. మనం అస్తమాను తలకాయతో ఆలోచిస్తున్నాము కాని హృదయంలో ఆలోచించటంలేదు. ఎంతసేపు మనకు తలకాయ గొడవే. నీ తలకాయలో ఉన్నానని భగవంతుడు చెప్పలేదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. కాలువలో నీరు ఎలా ప్రవహిస్తూ ఉంటుందో నా పట్ల మీ విశ్వాసం, మీ భక్తి, మీ ప్రేమ అలాగ నావైపు ప్రవహిస్తూ ఉంటే దానిని బట్టి మీరు బాగుపడటం అనేది సహజంగానే జరుగుతూ ఉంటుంది, మీకు తెలియ కుండా మీరు బాగుపడతారు. అప్పడు లోపల ఉన్న శాంతి, ఆనందం ఉబికి ఉబికి మీ సహస్రారానికి అందుతుంది. మోక్షం ఎప్పడో వస్తుంది, శాంతి ఎప్పడో వస్తుంది అనుకొన్నాము అప్పడే వచ్చేసింది ఏమిటి అని మిమ్మల్ని చూసిమీరే ఆశ్చర్యపడతారు. మనం ఈశ్వరుడిని స్మరించగా స్మరించగా అనాత్మకు దూరమవుతాము, మనం కాని విషయాలకు దూరమవు తాము. అగ్నిని సమీపించే కొలది వేడి ఎలా కలుగుతుందో అలాగ మనం అంతర్యామి అయిన పరమాత్మను సమీపించేకొలది నేచురల్‌గా, నార్మల్‌గా ఇంద్రియనిగ్రహం, మనో నిగ్రహం వచ్చేస్తాయి, దానికోసం ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు. కొంతమంది ప్రతీదీ నెగిటివ్‌గా ఆలోచిస్తారు. వారు నెగిటివ్‌గా ఆలోచిస్తున్నారని మనం కూడా

నెగిటివ్‌గా ఆలోచిస్తే దానివలన మనం పాడైపోతాము, ఇవన్నీ సహవాసదోషాలు. మీరు డబ్బు సంపాదించుకోవటానికి అమెరికా ఎలా వెళుతున్నారో అలాగ సజ్జనసాంగత్యం కోసం భూమి యొక్క అంచులదాకా వెళ్ళండి.

శ్రీకృష్ణచైతన్యుడి దగ్గర మస్తాన్ అని ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు. శ్రీకృష్ణ చైతన్య ఇంకో నాలుగు రోజులలో శరీరం విడిచిపెడతాడు అనగా ఆ భక్తుడితో మస్తాన్ నీవు నా కూడా తిరుగుతున్నావు, మతాలు వేరైనా నన్ను అవలంభిస్తున్నావు, నీకు ఏమి కావాలి మస్తాన్ అని శ్రీకృష్ణచైతన్య అడిగాడు. నాకేమి అక్కరలేదు, మీరు లేని ఈ లోకాన్ని నేను చూడలేను, మీరు ఉండగా నా శరీరాన్ని పంపేయండి అన్నాడు. అది వాడి విశ్వాసం. మస్తాన్ నీవు ఎంత పవిత్రుడవు అంటాడు శ్రీకృష్ణచైతన్య. నన్ను అప్పడే పవిత్రుడిని అని అనకండి. నా ముక్కులో గాలి బయటకు పోయిన తరువాత మస్తాన్ పవిత్రంగా బతికాడు అని చెప్పండి. నా ముక్కులో గాలి ఉన్నంతసేపు ఏదైనా పొరపాట్లు చేస్తే చెయ్యవచ్చు, మాయ అంత బలీయమైనది అని చెప్పాడు. మీ చేతులతో నన్ను పంపేయండి అంటే అప్పడు మస్తాన్‌కు శ్రీకృష్ణ చైతన్య ఆయన చేతులతో సమాధి చేసాడు. విశ్వాసం కనుక ఉంటే కొండలను కూడా కదపవచ్చు. అటువంటి విశ్వాసం ఎప్పడు కలుగుతుంది అంటే భగవంతుడు చెప్పిన మాటలపై మనకు నూటికి నూరుపాళ్ళు నమ్మకం కుదిరితే విశ్వాసం వస్తుంది కాని నోటి మాటల వలన రాదు, ఆ స్పందన హృదయంలో నుండి రావాలి. అనవసరమైన గొడవలలోనికి వెళ్ళిపోతే మీరు మాయలో చిక్కుకొనిపోతారు. మీరు బాగుపడే విధానం చూసుకోండి, నిరంతరం వాచింగ్‌లో ఉండండి. మీకు ఏవైనా చెడుతలంపులు వస్తున్నాయి అనుకోండి, చెడుతలంపులు వస్తున్నాయి, చెడుతలంపులు వస్తున్నాయి అంటే అవి పోవు. మంచి తలంపులు అలవాటు చేసుకొంటే చెడుతలంపులు పోతాయిగాని వూరికే పొమ్మంటే అవి పోవు. బుద్ధుడిది మోస్ట్ ఇంపెర్సనల్ లైఫ్. మీరు ఒక చిన్న మంచి పని చేసినా గుర్తింపులు కోరుకొంటారు. బుద్ధుడు ఒక మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టాడు. బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే బుద్ధుడు ఈ లోకంలోనికి వచ్చి వెళ్ళిపోయాడు అనే గుర్తింపు కూడా అక్కరలేదు అని చెప్పాడు. బుద్ధుడు బుద్ధుడు అని మనం అనుకొంటాము. అక్కడ అసలు ఒక పెర్సన్ కనబడడు. అక్కడ ఎవడో ఒక వ్యక్తి ఉన్నాడని చూసేవారికి అనిపిస్తుంది కాని అక్కడ నో ఇండివిడ్యువల్ లైఫ్, అది యూనివర్సల్ లైఫ్. ఆయన మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్ళిన తరువాత మరల దాని గురించి ఎప్పడూ తలపెట్టలేదు. అక్కడ వైరాగ్యం నూటికి నూరుపాళ్ళు మనకు కనబడుతుంది.

ఎక్కడ ఎక్కడ ఎక్కడ ఎక్కడ

ఎక్కడ వెదకను కృష్ణా! నిన్ను

ఎక్కడ వెదకను కృష్ణా!

॥ ఎక్కడ ॥

చిక్క కుంటివిర కంటికి కృష్ణా

దిక్కులన్ని నే వెదకి చూచినా,

ఎక్కడ వెదకను, ఎలాగ వెదకను

చిక్కుల బెట్టకు కృష్ణా, నన్ను చిక్కుల బెట్టకు కృష్ణా!

॥ ఎక్కడ ॥

దాగుడు మూతలు చాలునులే ఇక

అగపడు కంటికి కృష్ణా, తగునా మాయలు కృష్ణా నీకిటు

తగునా మాయలు కృష్ణా!

॥ ఎక్కడ ॥

పగలూ రేయీ పొగిలే నా ఎద

సెగలు తాకవా కృష్ణా, నావగపు మాన్పవా కృష్ణా!

॥ ఎక్కడ ॥

**- డా॥ R.A. నాయక్**

ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా
ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా!
నిదురన్నది రానీయక, మదివేరే తలపు లేక
ఎదవాకిలి తెరచి యుంటి, కదలిరార శ్రీకృష్ణా!

॥ ఎదురు చూతురా ॥

నవనీత చోరుడవే, నవనీతము నా ఎదరా
అవలీలగ దొంగలింప అదను ఇదేరా కృష్ణా!

॥ ఎదురు చూతురా ॥

మురళీ ప్రియ ప్రోయింపుము, మురళి కదా నా హృదయము
కరగి, సురగి, ఈ జగమే పరవశించి పోవలెరా!

॥ ఎదురు చూతురా ॥

యమునా నది విహారింపుము, ఈ ఎదయే నౌకరా
కమలనయన శ్రీకృష్ణా, కాలుమోపి లోనికి రా!
ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చుతురా, నీకై
ఎదురు చూతురా కృష్ణా, ఎదురు చూతురా!


– డా॥ R.A. నాయక్

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ 9 | | కాపవరం గీతాజయంతి |
| డిసెంబర్ 10 నుండి 15 వరకు | | అరుణాచలం క్యాంపు |
| డిసెంబర్ 11 | | అరుణాచలం దీపోత్సవం |
| డిసెంబర్ 24 | | గుండుగొలను |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



సద్గురు శ్రీ నాన్నగారు అక్టోబరు 16వ తేదిన

పాలకొల్లు మెయిన్‌రోడ్డులో అంబికా బంగారు ఆభరణముల

షాపు ప్రారంభించారు

# అవగాహన బట్టే - అనుభవం వస్తుంది

ఏదైతే అవగాహన చేసుకోబడదో దాన్ని అవగాహన చేసుకోవటానికి శాస్త్రం, గురువుల సూచనలను పరిశీలించాలి. శరీరం, ప్రాణం, బుద్ధి కానిది ఏదో అది నేను - శరీర మనోబుద్ధులు పరమాత్మచే పాలించబడుతోంది. అవి సత్యాత్మను పట్టుకోవేలవు; అవి జడ ప్రాయాలు, ఆత్మ వాటికి అతీతం. మనం పురుషునిగా, స్త్రీగా, దేవతగా ఆరాధిస్తున్నాము అనుకోండి మనం ప్రేమించేది శరీరాన్నా? కండరాలనా? ఎముకలనా? ముక్కునా? అందు నిజం లేదు. భోగాలు అనుభవిద్దాము అనుకొంటే రోగాలకు సిద్ధం కావాలి. మనం ఎంతెంత సత్య శోధన చేస్తామో అంతంతగా శీలం బలపడుతుంది. జ్ఞానమనే సూర్యకాంతిలోకి పోయేకొలది ఇంద్రియ వాసనలు కొవ్వత్తి కాలి నశించినట్లు నశిస్తాయి. పురుషుడిగా, స్త్రీగా, అందగానిగా, కురూపిగా, నిర్ధయునిగా, బలహీనునిగా, బలవంతునిగా కొత్త, కొత్త రూపాలు వరుసగా ధరించాలి. ఇవి వరుసగా ధరించే వస్త్రాలు. అన్ని రూపాల్లోనూ అహంకారం ఉంటుంది. ఆత్మానుభవంలో మనస్సు యొక్క వ్యాపారం ఆగిపోతుంది. మన కర్మానుగుణంగా ఈశ్వరుడు ప్రసాదించిన జీవితాన్ని కాదని నాకు ఈ సుఖం ప్రసాదించు, ఈ దుఃఖం నుంచి తప్పించు అని ప్రార్థిస్తే ఆయన ఎలా సాయం చేస్తాడు. వకంరగా ఉన్న పచ్చివెదురు కాల్చకుండా వంకర ఎలా పోతుంది. మన సంస్కారాలను రహితం చేయటానికి ఆయనే ఈ దుఃఖాన్ని ఏర్పాటు చేసాడు అనే అవగాహన రావాలి. అసలు ఈ మనస్సే ఈ కష్ట సుఖాలను మన చేత అనుభవింప చేస్తున్నది అని దాని మూలంలోకి వెళితే దాని అల్పత్వం అనుభవమౌతుంది. మన లక్ష్యం నిజ స్థితిని పొందటమే. భగవంతుడు మన అన్ని స్థితులకు ఆధారంగా ఉన్నాడనే విశ్వాసంతో ఆయనను ప్రేమించాలి. అందరూ "నేనే" అనే అవగాహన వస్తే ఇతరులను ప్రేమించకుండా ఎలా ఉండగలము. మహాత్ముల జీవిత చరిత్రల పరిశీలన ఒక అవగాహన ఇస్తుంది. అది స్ఫురణను, ప్రేరణను కలిగించి పరివర్తనను కలిగిస్తుంది. అది ఆ శక్తి, శ్రద్ధ, నిజాయితీలపై ఆధారపడి ఉంటుంది. బంధమంటే ఏమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న బుద్ధికి ముక్త స్థితి ఊహామాత్రంగానైనా అందుతుంది. ఒక చిన్న దీప కళిక కటిక చీకటిని పారద్రోలుతుంది. అలాగే అల్పబోధ కూడా మన అవిద్యను నాశనం చేస్తుంది. మన పరిస్థితులను మనమే సృష్టించుకొన్నాము. దేవుడు నిష్పక్షపాతి. కాని గురు అనుగ్రహంతో కర్మల వలయం నుంచి తేలికగా తప్పించుకోవచ్చును. "తానే తత్త్వమనుచు తలపోయలేక; మాయతత్వమనుచు మఱుగుచుండు; కర్మఫలము లేక కలుగునా తత్వంబు" అన్నారు వేమన. జీవితాన్ని ఒక పరీక్షగా సవాలుగా తీసుకోవాలి. ప్రపంచానికి దూరంగా వెళ్లటం మూర్ఖత్వం. ఏమీ సాధించలేము. శ్రీ నాన్నగారు "అద్దానికి ఎంత ప్రయోజనం ఉందో ఈ సృష్టికీ అంతే ప్రయోజనం ఉంది. ఈ సృష్టిలో ఎవరైనా నీపై నింద వేస్తే నీలో ఉన్న లోపంగా గ్రహించి తొలగించుకోవాలి. గ్రహణశక్తి ఉన్న వానికి దెబ్బలు తగలకుండానే జ్ఞానం కలుగుతుంది" అన్నారు. గురు అనుగ్రహం ఎక్కడ వర్షిస్తుందో అక్కడ చైతన్యం జాగృతమౌతుంది. దానికి గురుమూర్తిని ప్రేమించాలి అది ప్రధానం.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం